# కథ

**కూర్చున్న** చోటునుంచి ఇంచుకూడా పక్కకి జరగడంలేదు నాగమ్మ. తాటిచాప పరిచినట్టున్న ఆ మట్టినేల మీద ఒక కాలు చాపుకొని, ఇంకో కాలు దగ్గరికి మడిచి పెట్టుకుని.. ఒక చిన్న కర్రముక్కతో అదేపనిగా మట్టిని తవ్వుతూ ఉంది.

జుట్టంతా రేగిపోతూ, చెవుల్లో గులకరాళ్లేసి ఆడిస్తున్నట్లు బలంగా వీస్తున్న గాలులు ఆమెను విసిగిస్తున్నాయి. దానికి తోడు నడినెత్తికెక్కిన నిప్పురవ్వ మరింత చికాకు పుట్టిస్తున్నాడు. చేదు తిన్నట్టు మొఖమంతా చిట్లించి పైటకొంగును తలకు ముసుగులాగ చుట్టుకుంది.

పొద్దున మొదలుపెడితే మధ్యాహ్నం కావొస్తున్నది.. తవ్విన చోటంతా చిన్న గుంతలాగా ఏర్పడింది. వదులుగా అయిన మట్టినంతా కొద్దికొద్దిగా చేతుల్లోకి తీసుకుని కళ్లతోనే జల్లెడ పడుతున్నది.

దమ్మొస్తున్నది. దూపైతున్నది. వెంట తెచ్చుకున్న నీళ్ల బాటిల్ అందుకుని, ఉన్న ఆ గుక్కెడు నీళ్లూ గొంతులో పోసుకున్నది. దప్పిక తీరలేదు. యాష్టకొస్తున్నది.

అసహనంగా మట్టిని గుప్పెట్లోకి తీసుకుంది. కొంత ఆవేదన, కొంత బాధ, ఇంకొంత.. నిస్సహాయత ఆమెను ఆవహించి ఉన్నాయి.

''వో క్కా! ఏమన్న గానొచ్చెనా?''..

అక్కడికి కొద్ది దూరంలో ఉన్న తిరుమలమ్మ గట్టిగా కేకేస్తూ నాగమ్మ ఉన్న వైపు నడిచొచ్చింది.

చేతిలోని మట్టి దిక్కే తీక్షణంగా చూస్తున్నదల్లా చివ్వున తల పైకెత్తి.. 'ఏం కనిపించలేదు!' అన్నట్లు తలను అడ్డంగా అటూఇటూ ఊపింది నాగమ్మ.

తిరుమలమ్మ.. ''నాగ్గూడ!'' అని..

''ఈడికి నాల్గు దినాలైపాయే. బిడ్డతానికి వొయ్యోస్తంటాని జెప్పొస్తి ఇంట్ల. ఆయిమెనేమో.. 'తమ్మున్కి దెలుస్తే నీతోపాటు నన్ను గిట్ట పొట్టుపొట్టు తిట్టిపెడ్తడు. దేవులాడిన కాడికి సాల్ గాని.. ఇగ బయల్దేరు ఆడికెల్లి. అవల్ల నమ్మొద్దంట చెప్తుంటే గుడంగ వోతివి. ఇంట్ల పరిస్థితి తెల్సే తెల్సు. ఇప్పుడిగ ఉన్నది వాయే.. ఉంచుకున్నది వాయే! అన్నట్లున్నది నీ కత. అసలాడ ఏందింటున్నవో ఏడుంటున్నవో.. నాకైతే ఈడ మస్తు పర్శానైతున్నది!' అని పొద్దట్సంది ఒకటే పోన్ల మీన పోన్లు జేస్తుండది. ఈడ జూస్తెనేమో మూల్గు మునుపటోలెనే.. తిండి ఎప్పటోలెనే అన్నట్లుండది. 'ఇదొక్కరోజు సూశి రేపొస్తలే బిడ్డ!' అంట జెప్పి.. ఈ పూటకెట్లనో ఓలాగ ఒప్పిస్తి!'' అన్నది.. ఎండకు ముడుచుకుపోయిన లేత చిగురాకులా మొఖమంత దగ్గరికి చేసుకొని.

నాగమ్మ నిర్వికారంగా నవ్వి..

''కిస్మతక్కా అంతే! మన ప్రాప్తమెట్లుంటే అట్ల. అగో.. ఇప్పుడు నీ కొరకంత మాత్రమన్న బెంగటిల్లెటోళ్లు ఉన్నరు. మల్ల నాకు? వొచ్చినప్పట్సంది సూస్తుండవు గదా.. ఇంతవరకు ఆ మనిషి యాడున్నదో, తిన్నదో లేదో, అసలుండదో పోయిందో అన్న ఖాయిష్ గుడ్క లేకపాయే మా వోళ్లకు!'' అని శూన్యంలోకి చూసింది.

చిన్నప్పుడు ఇసుక కనిపిస్తే చాలు.. కర్రముక్కతో ఇలానే మట్టిని గెలుకుతూ ఆడుకునేవాడు ఆమె పెద్ద కొడుకు. ఆ రోజులన్నీ బొంగరం తిరిగినట్టు కళ్ల ముందు గిర్రున తిరిగాయి నాగమ్మకు.

కొడుకు చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలన్నీ ఇంటి వెనకాల గోడనిండా అల్లుకున్న బచ్చలి తీగల్లా ఆమెను గట్టిగా చుట్టేయగానే.. ఒక్కసారిగా గుడ్ల నిండా నీళ్లూరినయి ఆమెకు. తమాయించుకొని తిరిగి మళ్లీ పనిలో పడింది.

* * *

కొండంచున తపస్సు చేస్తున్న మౌన మునిలాగ ఉన్నాడు సూర్యుడు. ఆకాశమంతటా పరిచిన తన కాషాయాన్నంతా మెల్లిమెల్లిగా లాగేసుకుంటూ కొండల్లోకి జారిపోతున్నాడు.

''మబ్బైతుంది. ఏం గానొస్తలేదు. పోదం పా క్కా!''.. ఆ మబ్బులో కూడా వెలుగుని వెతుక్కుంటున్న తిరుమలమ్మతో అన్నది నాగమ్మ.

''వొస్తున్నక్కా! ఇగో గీ తొవ్విన మట్టికాడికి సూషొస్త. నిన్న ఒకాయిమెకు ఎట్లాయే! పాపం అంతసేపు దేవులాడ్తె కండ్లవడలేదు గాని, గదే కుప్పలకేంచి ఇంగొకాయిమెకు జెర్రంతసేపట్లనే ఎట్ల దొర్కే! నిజంగనే నీవన్నట్టు కిస్మత్.. అంతే!'' అని, పావుగంటసేపు వెతికి, ఇక లాభం లేదని అర్థమయ్యి పైకి లేచి, చీరకంటుకున్న మట్టినంతా దులుపుకొన్నది తిరుమలమ్మ.

ఆ తర్వాత అక్కణ్నుంచి నడిచి రోడ్డెక్కి, దగ్గర్లోని ఊళ్లోకి చేరుకున్నారిద్దరు. తెచ్చుకున్న డబ్బులు అయిపోవొస్తుండటంతో, వాళ్లు రోజూ రాత్రి పడుకోడానికి వెళ్లే హనుమంతుడి గుడిలో పెట్టిన ప్రసాదం తిని సర్దుకున్నారు ఆ పూటకి.

కానీ, నదిలో కలిసిపోయిన కాలువలా, సముద్రంలో తప్పిపోయిన నదిలా.. ఆ ప్రసాదం ముద్ద వాళ్ల కడుపుల్లో ఏ మూలకో వెళ్లి నక్కి కాసేపటికే అక్కణ్నుంచి మాయమైపోయింది. నాలుగు రోజులనుంచి సరిగా తిండీ తిప్పలు లేకుండా తిరుగుతుండటంతో నాగమ్మకు ఏదోలాగ అయిపోయింది. తిన్న ఆయింత ముద్ద ఏ పాటికీ కాలేదు. మరోపక్క ఆమె మెదడు నిండా నిండిపోతున్న ఆలోచనల ప్రవాహాన్ని నియంత్రించలేక పోతున్నది.

ఒళ్లంతా చెమటలు పట్టేశాయి. తల పగిలిపోతున్నది.

కళ్లు బైర్లు కమ్ముకుంటున్నాయి. నిలబడిన చోటే కూలబడిపోయి.. 'లేవలేను!' అన్నట్లుగా సైగ చేసింది.


తిరుమలమ్మకు కాళ్లూ చేతులాడలేదు. సాయం కోసం చూసింది. ఎదురుగా ఉన్న షాపులోని యజమాని వాళ్లను గమనించి పరుగున వచ్చి విషయం కనుక్కున్నాడు. వెంటనే వెళ్లి అతను ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని పట్టుకొచ్చి వాళ్లకిచ్చాడు.

ఆ తర్వాత వాళ్ల వివరాలు కనుక్కుని..

''ఏంటికమ్మా మీకీ తిప్పలు. అయ్యన్ని జరిగే పనులు కావు. నూటికో కోటికో ఎవురో ఒకరికి.. అంతే! అనోసరంగా ఆశలు పెట్టుకోమాకండి. మీలాగే చానామంది ఆళ్ల పనులు ఇడిసిపెట్టుకుని ఈడకు వొస్తారు. వారం పది దినాలు ఈడే ఉంటారు. తిండికి, రేత్రి పొద్దు పండుకోనీకి నానా తంటాలు పడతాంటరు. అవొసరం, ఆశ మనిషిని ఎంత దూరమైనా తీసుకపోతయి.. ఏమైనా చేయిస్తయి. ఆశపడ్డట్లు దొరికితే అది యేరే ఇసయం, ల్యాకపోతే..? అందుకే మీకింత ఇదిగా చెబుతాండ. సరే.. ఈ పొద్దుకి ఈడే పండుకోండి. పొద్దున్నే మిమ్మల్ని బస్టాండ్కి తోల్కపోతా. హాయిగా ఇంటికి పోండి. మీ ఇంటోళ్లు ఎంత బుగులు పడతాంటరో ఏమో!'' అని అతను చెప్తుంటే.. ఆ చివరి మాటకు మనసులోనే పిచ్చిగా నవ్వుకున్నది నాగమ్మ.

''రేపొక్కటి సూశి పోతం సారు!''అన్నది తిరుమలమ్మ.

అతనిక ఏమీ అనలేక, వొద్దంటున్నా ఖర్చు




**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.**